**కథ**

మధ్యాహ్నం ఒంటిగంటయ్యింది. భోజనం, వంటింటి పని ముగించి హాల్లోకి వచ్చి సోఫాలో కూర్చుంది సావిత్రి. టీపాయ్ మీదున్న పేపరు తీసి చదువుదామని ప్రయత్నించింది. కానీ ఆమె మనసు పేపరుమీద లగ్నం కాలేదు. కొడుకు రఘు, కోడలు మంజుల ఎడమొహం, పెడమొహం పెట్టుకొని తిరుగుతున్న దృశ్యమే కళ్లముందు కదులుతూ ఆమెను అశాంతికి గురిచేస్తోంది.

కబుర్లతో, నవ్వులతో కళకళలాడే ఇల్లు ఒక్కసారిగా నిశ్శబ్దమైపోయింది. చిలిపి తగువు అయి ఉంటుంది. రెండు రోజుల్లో వాళ్లే రాజీపడిపోతారు అనుకున్న సావిత్రి, వారం గడిచినా వారిద్దరి మధ్యా మౌనమే రాజ్యమేలుతూ ఉండటంతో కంగారుపడసాగింది. చిన్నకొడుకు రవికి, చిన్న కూతురు సుజాతకి పరీక్షలు దగ్గర కొస్తున్నాయి. తనింక నాలుగురోజుల్లో ఊరికి వెళ్లిపోవాలి. తను వెళ్లేలోపల రఘు, మంజుల రాజీపడిపోతే ఫరవాలేదు కాని లేకపోతే ఊరికి వెళ్లిపోయినా తనకు ఆందోళనగా, అశాంతిగా ఉంటుంది. ఎంతో కలివిడిగా ఉండే మంజుల ఈవారం రోజులనించి తనతో కూడా ముభావంగా ఉంటోంది. వాళ్లు పెళ్లయి కాపురం పెట్టి ఏడాది కూడా కాలేదు. చిన్నపిల్లలిద్దర్నీ ఇంజనీరింగు చదివిస్తూ వాళ్లతో ఉంటున్నతను మొదటిసారిగా ఇక్కడికి వచ్చింది. కోడలితో బాగా చనువు ఏర్పడలేదు. అందుచేత కోడలిని కారణం కనుక్కోవటానికి జంకింది.

రఘునైనా అడిగి విషయం తెలుసుకుంటే తప్ప తనకు నిద్రపట్టేలా లేదు. అనుకుంటూ లేచి కాఫీ కలుపుకోవడానికి వంటింట్లోకి నడిచింది సావిత్రి.

★ ★ ★

రాత్రి భోజనాలు ముగిసేయి. మంజుల కంచాలు, గిన్నెలు తీసి డైనింగు టేబిల్ శుభ్రం చేసింది.

''నాకు బాగా అలసటగా ఉందత్తయ్యా! వెళ్లి రెస్టు తీసుకుంటాను. గుడ్‌నైట్!'' అని సావిత్రికి చెప్పేసి బెడ్‌రూమ్‌లోకి వెళ్లిపోయింది.

సావిత్రి హాల్లోకి వచ్చి పేపరు చదువుతున్న రఘుకి ఎదురుగా కూర్చుని, ''రఘూ'' అని పిలిచింది నెమ్మదిగా. రఘు తలెత్తి తల్లివైపు చూశాడు.

''వారం రోజులుగా మీరిద్దరూ నాతో ముభావంగా ఉంటున్నారు. మీలో మీరు మాట్లాడుకోవడం కూడా కనబడలేదు. మీరిద్దరు ఏమైనా మాటా మాటా అనుకున్నారేమో అనిపిస్తోంది. అందుకు నేను ఇక్కడికి వచ్చి ఉండటం కారణం కాదు కదా అని అనుమానం కూడా వస్తోంది'' అంది సావిత్రి బాధగా. తల్లి తమను అపార్థం చేసుకున్నందుకు రఘు కంగారుపడిపోయాడు.

''అలాంటి అనుమానం నువ్వెప్పటికీ పెట్టుకోవద్దమ్మా! మంజులకు నువ్వంటే ఎంతో గౌరవం, అభిమానం'' అన్నాడు.

# మంచిమాట

''అయితే మంజులమీద నువ్వు దేనికైనా కోపం తెచ్చుకున్నావా?''

''కోపం నేను తెచ్చుకోలేదమ్మా! తనే నా మీద కోపగించుకొని మాటలు మానేసింది.''

''ఎందుకని రఘూ?''

''వాళ్ల పెద్దతమ్ముడికి ఇంజనీరింగులో సీటు వచ్చిందిట. తను ప్రతి నెల డబ్బు పంపి చదివిస్తానని అంది. నేను వీల్లేదన్నానని కోపం తెచ్చుకొంది.''

''నీ తోబుట్టువులలాగే తన తోబుట్టువులు కూడా బాగా చదువుకొని పైకి రావాలనీ, అందుకు తను సాయం చెయ్యాలనీ మంజుల అనుకోవడంలో తప్పేముంది రఘూ?''

''అనుకోవడంలో తప్పు లేదు తను డబ్బు పెడతానంటే నేనెలా ఒప్పుకుంటానమ్మా?''

''ఎందుచేత ఒప్పుకోవు?'' అని అడిగింది సావిత్రి.

''తెలియనట్లు అడుగుతున్నావేమిటమ్మా? పెళ్లయిన ఆడపిల్ల అత్తింటి బాధ్యతలు పంచుకోవాలి కాని ఉద్యోగం చేస్తున్నంత మాత్రాన పుట్టింటికి దోచి పెడతానంటే ఎలా?''

''ఉద్యోగం చేస్తున్న అక్క తోబుట్టువు చదువుకి సాయం చెయ్యడం దోచిపెట్టడం అవుతుందా రఘూ? ఆనాడు మీబావ కూడా నీలాగే ఆలోచించి వుంటే నీ చదువు సాగేదేనా? ఇంత మంచిస్థితిలో ఉండేవాడివేనా?''

అవాక్కయిన రఘు క్షణంలో తేరుకున్నాడు.

''దానికీ దీనికీ తేడా లేదా అమ్మా? నాన్నగారు పోతే అక్కకి ఆ ఉద్యోగం ఇచ్చేరు. అందుచేత మనకు సాయం చెయ్యవలసిన బాధ్యత అక్కకు లేదా అమ్మా?''

''లేదని నేననడం లేదు. కాని మనని ఆదుకోవలసిన అవసరం బావకి లేదు కదా! దానికితోడు మీ నాన్నగారు పోగానే తన పద్దెనిమిదో ఏట ఉద్యోగంలో చేరిన అక్క పదేళ్లు మన కుటుంబ బరువు బాధ్యతలు మోసింది. అప్పుడైనా అక్కకు పెళ్లి చెయ్యకపోతే నలుగురిలో తలెత్తుకొని తిరగలేనని పించి నచ్చజెప్పి పెళ్లికొప్పించాను. ఇంటర్ చదువుతున్న నిన్ను పరీక్షలవగానే ఏదైనా చిన్న ఉద్యోగంలో పెట్టాలనీ, మన బ్రతుకు మనం బ్రతకాలి కానీ అక్కనింకా ఇబ్బందిపెట్టి డబ్బు ఆశించడం తగదని అనుకొన్నాను. కానీ నీ బావ ఉత్తముడు. ఇంజనీరింగు చదవాలనే నీ ఆశను అర్థం చేసుకున్నాడు. అందుకే నిన్ను ఇంజనీరింగులో చేర్పించి, నువ్వు చదువు పూర్తిచేసుకొని ఉద్యోగంలో స్థిరపడేవరకు సంతోషంగా సహకరించాడు.''

''నిజమేనమ్మా! కాని కూతుర్ని చదవించినట్లే కొడుకుల్ని కూడా చదివించడం మామగారి బాధ్యతకదా అమ్మా? స్తోమతు లేకపోతే ఊళ్లో ఉన్న కాలేజీలోనే డిగ్రీ చెప్పిస్తే సరిపోతుంది కదా!'' అన్నాడు రఘు.

''అంతావిని మళ్లీ మొదటికే వస్తున్నావా రఘూ! మీ మామగారు చేసేది పెద్ద ఉద్యోగం కాదు. దానికితోడు కొద్దిరోజుల్లో రిటైరవబోతున్నారు. అందుచేత మంజులకి చెప్పించినట్లు కొడుకులకి పెద్ద చదువులు చెప్పించే స్థితిలో లేరు.

అలాంటప్పుడు తమ్ముడి చదువుకి తను సాయం చెయ్యాలనుకోవడం సహజమే కదా! నీతో మళ్లీ మళ్లీ ఘర్షణ పడటం ఇష్టంలేక మంజుల నీ పంతమే నెగ్గించిందనుకో! తను మంచి ఉద్యోగం చేస్తున్నా, పెళ్లి చేసుకొని ఆర్థిక స్వాతంత్ర్యం పోగొట్టుకోవడంవల్లనే కన్నవారికి అండగా ఉండలేకపోయిందన్న బాధ తన మనస్సులోంచి పోదు. ఆ బాధతో నిన్ను మనస్ఫూర్తిగా ప్రేమించి గౌరవించలేకపోవచ్చు. క్రమంగా ఆబాధ మామీద కూడా కోపంగాను, ద్వేషంగాను మారినా ఆశ్చర్యపడక్కర్లేదు. అది మనకు క్షేమంకాదు రఘూ! మనింట్లోకి కోడలుగా అడుగుపెట్టి నీ కష్టసుఖాల్లో, బాధ్యతల్లో పాలు పంచుకుంటున్న మంజుల సంతోషంగా ఉండేటట్లు చూసుకోవడం మన బాధ్యత రఘూ! మీరిద్దరూ ఒకరినొకరు కోరుకొని పెళ్లి చేసుకున్నారు. ఎప్పటికీ అన్యోన్యంగా, సంతోషంగా బ్రతకాలని నా ఆశ, ఆరాటం. మీరు ఘర్షణ పడితే నేను భరించలేనురా!'' అంటూ లేచివెళ్లి కొడుకు తలని వాత్సల్యంతో నిమిరి తన గదిలోకి వెళ్లిపోయింది సావిత్రి.



★ ★ ★

రఘు చాలాసేపు సోఫాలో కూ ్చుండిపోయాడు. తల్లిమాటలు తలుచుకొ ిూంటే అతని మనస్సు సిగ్గుతో చితికిపోసాగిం( నిజానికి అక్క, బావ చేసే ఉద్యోగాలు తను, మ జుల చేసే ఉద్యోగాల కంటే చాలా చిన్నవి. కానీ ారి మనస్సులు పెద్దవి కనుక తనకు తాహతు మించిన చదువు చెప్పించేరు. కాని తను, తన భ ్య సంపాదన తనకే చెందాలనే స్వార్థబుద్ధితో స ుచితంగా ప్రవర్తించాడు. కూతురిసొమ్ము కన్నవా ు ఆశించకూడదనే పాతకాలపు అభిప్రాయా అడ్డుగా పెట్టుకోని, డబ్బు పంపకూడదని శ ంచాడు. కాని పాతకాలపు మనిషయినా, పెద్దగా ువుకోకపోయినా, చిన్నటౌనులో చిన్న పెంకుటింట్లో నాలుగ్గోడల మధ్య, ఎన్నో కష్టసుఖాలను, సమస్యలను ఎదుర్కొంటూ గడిపిన అమ్మలో ఎంత విజ్ఞత! ఆడపిల్ల కన్నవారికి సాయం చేయరాదన్న రూలేమీలేదనీ, అవసరం వస్తే ఆదుకోవలసిన ధర్మం ఉందనీ, ఒక మంచిపనికోసం సాయం చేస్తానంటే అడ్డుపెట్టడం ఉచితంకాదని అమ్మ ఎంత బాగా చెప్పింది! తమ మధ్య మనస్పర్థలకు కారణం తెలుసుకొని సకాలంలో తనకు హితవు చెప్పి అమ్మ కనువిప్పు కలిగించబట్టి తన పొరపాటు తెలుసుకోగలిగాడు! లేకపోతే కలతలతో తన సంసారంలో సుఖసంతోషాలు శూన్యమయ్యేవి! ఇకమీదట తను మూర్ఖంగా ప్రవర్తించి మంజుల మనస్సు నొప్పించకూడదు! తను సంతోషంగా ఉంటేనే సంసారం సుఖమయమవుతుంది. రఘు లేచి బెడ్‌రూంలోకి నడిచాడు.

★ ★ ★

ఉదయం పూజ ముగించి లేచింది సావిత్రి. వెలిగిపోతున్న మొహంతో మంజుల వచ్చి, ''మీ మేలెప్పటికీ మర్చిపోలేనత్తయ్యా'' అంటూ వంగి భక్తితో సావిత్రి పాదాలు తాకి కళ్లకద్దుకొంది. మనసారా దీవిస్తూ కోడల్ని లేవనెత్తి దగ్గరకు తీసుకుంది సావిత్రి. ✪

**జి.సరస్వతి**